తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
సోమవారం
1 జూన్ 2026
పేజీలు - 8




# వామ్మో జూన్!

- విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పెరగనున్న ఖర్చులు
- ఫీజులు, యూనిఫారాల కోసం అప్పులే
- మధ్య తరగతి జీవితాల్లో అప్పుల తిప్పలు




**జూన్ నెల వస్తుందంటే మధ్యతరగతి జీవితాల్లో గుండె దడేళ్లు మంటుంది. మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులు పిల్లల చదువులకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. బాగా చదువుకోవాలి, మంచి ఉద్యోగంతో ఉన్నత స్థితికి చేరాలని ఆర్థికంగా ఎంత భారమైనా భరిస్తారు. పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు అప్పులు చేయడానికి కూడా వెనకాడరు. అందుకే జూన్ నెల వచ్చిందంటే వారిలో టెన్షన్ మొదలవుతుంది. ఒకటో తారీఖు అంటే ప్రతి నెలా సామాన్య కుటుంబాలకు ఇబ్బందిగానే ఉంటున్నా జూన్ నెలలో మాత్రం ఇంకాస్త భయాన్ని కలిగిస్తుంది. ఇంటి బడ్జెట్ కు తల్లిదండ్రుల కసరత్తు మొదలైంది.**

**బెల్లంపల్లి, మే 31, (జనంసాక్షి) :**

జూన్ నెల వస్తుందంటేనే పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు హడలిపోతారు. ప్రతి కుటుంబంపై జూన్ నెలలో రూ 50 వేల నుంచి రూ లక్ష వరకు బడి ఖర్చులు ఉంటాయి. మరో పది రోజులు మాత్రమే పాఠశాలలకు సెలవులు మిగిలి ఉన్నాయి. పాఠశాలలు తెరుచుకోవడానికి ముందే విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, యూనిఫాంలు, షూస్ సహా కొనుగోలు చేయడంతో పాటు ఫీజుల మోతను ఎదుర్కోవడానికి తల్లిదండ్రుల్లో దడ మొదలైంది. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోత మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ ను తలకిందులు చేస్తోంది. కళాశాలలు, పాఠశాలల్లో ఫీజులు కూడా భారీగా పెంచారు. ప్రభుత్వం ఈసారి సకాలంలోనే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందించడానికి చర్యలు చేపట్టారు. మంచిర్యాల జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా యూనిఫాంలను వేగంగా కుట్టిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం కొన్ని దుకాణాల్లో పుస్తకాల అమ్మకాలు మొదలు పెట్టారు. ఈసారి పుస్తకాల ధరలు స్వల్పంగానే పెరిగినా, సామాన్యుడు కొనలేని పరిస్థితి మాత్రం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు అందించినా కానీ వీటికి సంబంధించిన క్వశ్చన్ బ్యాంకులు, ఇతర సామగ్రి కొనుగోలుకు మధ్యతరగతి కుటుంబాలు డబ్బులు సమకూర్చుకోవడానికి హడలిపోతున్నారు. స్కూల్ ఫీజుల మాట వింటేనే భయపడిపోతున్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని ఇంజనీరింగ్ కు వెళ్లే పిల్లలు ఉంటే బంగారం లాంటి వస్తువులు తాకట్టు పెట్టుకోవడానికి సిద్ధం అవుతున్నారు. మరోవైపు అడ్మిషన్లు, పుస్తకాలు అయిపోతాయంటూ ప్రైవేట్ పాఠశాలలు చేస్తున్న ప్రచారం కూడా అంతా ఇంతా కాదు. వేసవి పోయి వాతావరణం చల్లబడుతుందని సంతోషం కంటే జూన్ మాసం నుంచి ఎలా గట్టెకోక్కాలో తెలియని పరిస్థితి పేద కుటుంబాల్లో కనిపిస్తుంది. ముఖ్యంగా మంచిర్యాల జిల్లాలోని వ్యవసాయ కుటుంబాలు తమ పిల్లలకు ఉన్నత విద్యను అందించాలని ఆరాటపడుతున్నారు. ఇందుకోసం ప్రైవేట్ విద్యపై మొగ్గు చూపుతుండటంతో మోయలేని భారంగానే మారింది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో వివిధ రకాల ఫీజుల పేరుతో వసూలు చేస్తూ మానసిక క్షోభకు కూడా గురిచేస్తున్నారు. అయినప్పటికీ పిల్లల తల్లిదండ్రులు పడుతున్న ఆరాటం ఖర్చుల ఇబ్బందులు చెప్పలేనిది కాదు. ఏపాఠశాలలో, ఏకళాశాలలో చేర్పించాలి, ఏవిద్యాసంస్థలకు ఎక్కువ ర్యాంకులు వచ్చాయి, ఎంత ఖర్చు అవుతుందనే విషయాలపై ఆరా తీస్తున్నారు. ఖర్చు భారంగా మారినా పిల్లల భవిష్యత్తు కోసం వెచ్చించక తప్పదని భావించిన తల్లిదండ్రులు ఖర్చులకు వెనుకాడటం లేదు. సామాన్య, మధ్య తరగతి వారు, ప్రైవేట్ ఉద్యోగులు ఇందుకోసం కొన్ని నెలల ముందు నుంచే తమ ఖర్చులను తగ్గించుకోవడం, ఇతర పనుల కోసం డబ్బులను వెచ్చించకుండా వాయిదా వేసుకుంటున్నారు.

### ఖర్చుల భారం...

ప్రైవేట్ పాఠశాలలు తెరుచుకోవడం తోనే ఫీజు చెల్లించడం ఒక భారం అయితే, ఇతర ఖర్చులు ఇబ్బందులకు గురి చేస్తాయి. పిల్లలను పాఠశాలలకు పంపించడానికి యూనిఫామ్, ఇతర సామాగ్రి కొనుగోలు కష్టంగా మారుతుంది. పుస్తకాలు, డ్రెస్సులు, షూలు, సాధారణ దుస్తుల ఖర్చు, బస్సు ఫీజులు ఇలా అనేక విషయాలను తల్లిదండ్రులు లెక్కలు వేసుకుంటున్నారు. కొన్ని పాఠశాలల్లో బయట నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు కొనుగోలు ఒప్పుకోరు. పాఠ్య పుస్తకాలు, బ్యాడ్జిలు, పాఠశాలలోనే కొనుగోలు చేయడంతో కనీసం ఉద్దెర పొందే పరిస్థితి ఉండదు. యాజమాన్యాలు నిర్ణయించిన రేటుకు తీసుకోవడం కూడా పిల్లల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఇంటికి అదనంగా యాభై వేల వరకు అవుతుంది. జూన్ నెలలో విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుందంటేనే ప్రతి ఇంటిలో మిగతా 8లో..

# జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్
- బాణాసంచా కాల్చడం, చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 31(జనంసాక్షి ): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 1న కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ యాక్ట్-30 అమలులో ఉన్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా, ప్రశాంతంగా జరిగేలా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చడం, ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. పోలీస్ యాక్ట్-30 నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి శాంతియుత వాతావరణం నెలకొనేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె కోరారు.




# 'రుద్రమ' బ్రాండ్‌కు దేశవ్యాప్త గుర్తింపు తీసుకురావాలి

- ల్యాదల్లలో 'రుద్రమ' బ్రాండ్‌తో తెలంగాణ మహిళా ఆత్మగౌరవానికి కొత్త అధ్యాయం
- స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ మినీ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

వార్త మెయిన్ 7లో

# జనగణన హెచ్ఎల్ఓ లోపాల సవరణ

- ఇందిరమ్మ ఇండ్ల మహా గృహప్రవేశాలను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులకు దిశానిర్దేశం



వార్త మెయిన్ 7లో

# ప్రీ స్కూల్‌లో విద్యార్థుల నమోదు

## అమ్మ మాట- అంగన్వాడీ బాట




**నర్సంపేట. మే 31 (జనం సాక్షి)** నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి సెంటర్ 2 లో "అమ్మ మాట బంగారు బాట" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రీ స్కూల్ (2.5 ఏండ్ల ) పిల్లల నమోదు ప్రక్రియతో పాటుగా అంగన్వాడీ కేంద్రాల్లో 5-6 ఏండ్లు పూర్తి అయిన పిల్లలకు విద్యారంభం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సర్టిఫికెట్ ఒకటో తరగతికి ఉపయోగపడనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అంగన్వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు ఉచిత దుస్తులను పంపిణీ చేశారు. అంగన్వాడీ పరిధిలో అర్హులైన 3 నుండి 6 సంవత్సరాల అర్హులైన పిల్లలను గుర్తించి నమోదు చేయించినట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో నేర్చుకోవడానికి అనువైన వాతావరణం కల్పిస్తున్నట్లు ఏసీడీపీఓ జ్యోతి తెలిపారు. ఆట పాటలతో, రకరకాల వస్తువులతో పిల్లల్లు నేర్చుకునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చదవడానికి రాయడానికి కావలసిన నైపుణ్యాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. అంగన్వాడీలో చదువు సమగ్రాభివృద్ధికి నెలవు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ జ్యోతి, సూపర్వైజర్ అరుణ, ఇటుకాలపల్లి సెంటర్ 2 టీచర్ రమాదేవి, మిగతా అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

# ప్రిన్సిపాల్‌కి స్వాగతం పలికిన సంఘువిశ్వాసులు



**ఆత్మకూర్, మే 31 (జనం సాక్షి):** ఆత్మకూరు సెయింట్ థెరిస్సా స్కూల్ కి నూతనంగా ప్రిన్సిపాల్ గా వచ్చిన సిస్టర్ నిర్మల ని కొత్తగట్టు సింగారం గ్రామంలోని దివ్య బాల యేసు దేవాలయం లోసంఘ పెద్దలు సంఘా విశ్వాసులు శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.సిస్టర్ నిర్మల మాట్లాడుతూమా స్కూల్లో క్రమశిక్షణతో పాటు పిల్లల నైతిక విలువలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తాము అని వివరించారు. .పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పాఠశాల ఎంత ముఖ్యమో, తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే కీలకం. మీ పిల్లల విద్యా ప్రయాణం విజయవంతం కావాలని,పిల్లలు ప్రతిరోజు పాఠశాలలో నేర్చుకున్న విషయాలను ఇంట్లో ఒకసారి అడిగి తెలుసుకోండి. వారి హోంవర్క్ డైరీని క్రమంతప్పకుండా పరిశీలి ంచండి అని వివరించారు..ఈ కార్యక్రమంలో ఫాదర్ అల్లం ఇన్నా రెడ్డి ఉపదేశి మల్లయ్య, సంఘ పెద్దలు ,యువతి యువకులుపెంబర్తి వినయ్,మౌనిక, ప్రియాంక, అనూష, సునీత, పద్మ, రమ, నీల, మల్లికంభ తదితరులు ఉన్నారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తాండూరు మండల నాయకులు

**తాండూర్, మే 31( జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా : తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వేణునగర్ లో రైతుల పొలం లో కళ్ళలల్లో ఉన్న వడ్లను పరిశీలించడం జరిగింది, ఈ ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 500 బోనస్ పైన రైతంగం హర్షం వ్యక్తం చేసారు ఇప్పటి వరకు మండలం లో 18000 క్వింటలు 95% కొనడం జరిగింది ఇంకా 5% త్వరలో పూర్తిగా కొనడం జరుగుతుంది అని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో తాండూర్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి ఈసా మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ కాసిపేట సర్పంచ్ కిష్టంపేట గ్రామపంచాయతీ సర్పంచ్ సార్ల తిరుపతి ముదాం గోవర్ధన్ బోయపల్లి సర్పంచ్ శంకరమ్మ భూమయ్య త్రీ ఇంక్లైన్ సర్పంచ్ చందనాలు రవికుమార్ సింగల్ విండో డైరెక్టర్ మాసాడి తిరుపతి మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పట్టెం విష్ణు కళ్యాణ్ బోయపల్లి ఉపసర్పంచ్నల్లుల మహేష్ బుగ్గ డైరెక్టర్ కొరాల శంకర్ కాంగ్రెస్ నాయకులు ముస్కె సాగర్ ఎగిడి సంతోష్ నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.



# హజ్రత్ సయ్యద్ జమాలే బహార్ బాబా (ర.అ) ఉర్సు మహోత్సవం విజయవంతంగా నిర్వహణ

**నర్సంపేట మే 31 (జనం సాక్షి)**నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద గల హజ్రత్ సయ్యద్ జమాలే బహార్ బాబా (రహ్మ తుల్లాహి అలైహి) వారి వార్షిక ఉర్సు మహోత్సవం 2026 మే 28 మరియు 29 తేదీలలో ఘనంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహిం చబడింది.మే 28వ తేదీ గురువారం సాయంత్రం మగ్రిబ్ నమాజ్ అనంతరం సందల్ కార్యక్రమం ప్రారంబమై భక్తుల సమక్షంలో ప్రార్థనలు నిర్వహించబడినవి.పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సందల్ ఊరేగింపు శాంతియుతంగా సాగింది.మే 29వ తేదీ శుక్రవారం రాత్రి 7:30 గంటలకు ఫాతిహా ఖానీ నిర్వహించబడింది. అనంతరం రాత్రి 8:00 గంటలకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేసి, పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు ప్రసాదం పంపిణీ చేయబడింది. రాత్రి 8:30 గంటలకు ప్రసిద్ధ మౌలానా షాహిద్ రజా, రయాన్ రజా. ద్వారా బయాన్ కార్యక్రమం నిర్వహించగా, రాత్రి 9:00 గంటలకు ఖవ్వాలి కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులను అలరించింది.ఈ ఉర్సు మహోత్సవంలో నర్సంపేట మరియు పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం మొత్తం శాంతియుతంగా, క్రమశిక్షణతో సాగినది.ఈ సందర్భంగా సహకరించిన దాతలు, స్వచ్ఛంద సేవకులు, పోలీసు శాఖ మరియు మీడియా ప్రతినిధులకు జమాలే బహార్ దర్గా కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో దర్గా అధ్యక్షులు మహమ్మద్ అహ్మద్, గౌరవ అధ్యక్షులు మహమ్మద్ అఫ్జల్,ముర్షద్, హాజీ పాషా, జామే మస్జిద్ కమిటీ అధ్యక్షులు మీర్జా మసూద్ అలీ బెగ్,19వ వార్డ్ కౌన్సిలర్ సలావుద్దీన్ అయ్యూబ్ ఖాన్, ఖలీల్, జలీల్, మాజిద్,వజీర్, రబ్బాని,యాకుబ్, రషీద్, సలీం, రియాజ్, ఖాదర్, ఖాసీం,అఫ్జల్, సర్వర్, ముస్తాక్, అఖిల్, జాహెద్, హఫీజ్ ,అఫ్రోజ్, మున్ను, వజూ, ఇమ్రాన్, జానీ, సమీర్, తదితర కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.



# కన్నుల పండుగగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**హనుమకొండ ప్రతినిధి మే 31 (జనం సాక్షి) :** కన్నుల పండుగగా 29 సంవత్సరాల తర్వాత శ్రీ విజయ భారతి జూనియర్ కాలేజ్, హంటర్ రోడ్, హన్మకొండ బైపిసి1995--97 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు 29 సంవత్సరాల తర్వాత, స్నేహితులమంతా ఒకే వేదికపై కలుసుకోని అంబరాన్ని అంటే సంబరాలు చేసుకున్నారు.ముందుగా కీర్తిశేషులు వంశీ కృష్ణ మరియు ప్రవీణ్ బాబులకు అశ్రునయనాలతో వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని,వారి కుటుంబ సభ్యులకు ఈ బాధను తట్టుకునే శక్తిని ఇవ్వాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు కాలం వీరందరినీ వేర్వేరు దారుల్లో నడిపించినా, వారి హృదయాలను కలిపిన ఆ కాలేజ్ జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ మరచిపోలేదు . తరగతి గదులు, ల్యాబ్‌లు, పరీక్షల ఒత్తిడి, స్నేహితుల అల్లరులు, ఉపాధ్యాయుల మార్గదర్శనం -- ఇవన్నీ ఈరోజు మళ్లీ మన కళ్లముందు కదలాడుతున్నాయి అని గుర్తుచేసుకొన్నారు. 1995లో విద్యార్థులుగా ప్రారంభమైన వీరి ప్రయాణం, 1997లో కాలేజ్‌ను విడిచిన తర్వాత అనేక రంగాల్లో విజయాలను అందుకున్నారు




వైద్యులు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, వ్యాపారవేత్తలు, ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి ఒక్కరూ తమ తమ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు.కానీ ఈరోజు వారు ఏ హోదాలో ఉన్న తోటివారికి సహాయ సహకారాలను అందిస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా వివిధ సేవా కార్యక్రమాలు చేస్తూ , విరాళాలు సేకరించి చేయూత అందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి స్నేహితుడికి, నిర్వాహకులకు మరియు కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు. తెలిపారు

# లంబాడీల ఆత్మగౌరవాన్ని కించపరచే ప్రయత్నాలను అడ్డుకుంటాం: బోడ రమేష్ నాయక్



**మహబూబాబాద్ ప్రతినిధి, మే 31 (జనం సాక్షి):**మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ మాట్లాడుతూ, లంబాడీల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఆదివాసి, గిరిజన సంఘాల పోరాటాల ఫలితంగానే గూడాలు, తండాలు గ్రామపంచాయతీలుగా ఏర్పడ్డాయని, అలాగే గిరిజనుల వాటా కోసం జరిగిన ఉద్యమాల ద్వారా తెలంగాణలో 10 శాతం రిజర్వేషన్ సాధించగలిగామని వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి కూడా అసెంబ్లీ సాక్షిగా గుర్తించారని అన్నారు.జూన్ 3న ములుగు నియోజకవర్గంలోని పాకాల-కొత్తగూడలో నిర్వహించనున్న "తుడుం దెబ్బ" సమావేశంపై స్పందిస్తూ, లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా జరిగే ఏ కార్యక్రమాన్నైనా తాము వ్యతిరేకిస్తామని వారుహెచ్చరించారు. ఆదివాసి సమాజంలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలను గిరిజనులు అప్రమత్తంగా గమనించాలని సూచించారు. అదేవిధంగా, కొందరు వ్యక్తులు ఉద్యమాల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.జూన్ 3న జరిగే కార్యక్రమానికి సంబంధించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా, అందుకు ప్రభుత్వం మరియు సంబంధిత బాధ్యులే సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య బాలాజీ నాయక్, జిల్లా కార్యదర్శి భూక్య లాల్ సింగ్ నాయక్, చక్రవర్తి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కుబీర్‌లో వీవోఏల 'గడ్డి తిని' వినూత్న నిరసన

## 14వ రోజుకు చేరిన సమ్మె!



**కుబీర్, మే 31, (జనంసాక్షి):** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా కుబీర్ మండల ఐకేపీ వీవోఏలు ఆదివారం వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలో వీవోఏలంతా కలిసి గడ్డి తిని ప్రభుత్వ మొండివైఖరిని ఎండగట్టారు. వీవోఏలు చేపట్టిన ఈ నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా "ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నశించాలి" అంటూ వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం నాయకులు మాట్లాడుతూ.. గత 14 రోజులుగా నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని, అర్హత కలిగిన వీవోఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడి తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మండలంలోని వీవోఏలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ దవాఖాన స్థలాన్ని కబ్జా చేసి భవన నిర్మాణం

## అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం




**మహబూబాబాద్ ప్రతినిధి, మే 31 (జనం సాక్షి):**గూడూరు మండలంలోని ప్రభుత్వ దవాఖానకు చెందిన భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి భవన నిర్మాణం చేపడుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత స్థలంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటూ, పలుమార్లు తహసీల్దార్‌తో పాటు జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గిరిజన సంఘాల ఫిర్యాదుల నేపథ్యంలో గతంలో కొంతకాలం పాటు నిర్మాణ పనులు నిలిచిపోయినప్పటికీ, ప్రస్తుతం రాత్రి వేళల్లో రహస్యంగా మళ్లీ పనులు కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా కబ్జా చేస్తుండగా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ దవాఖాన స్థలం ఆక్రమణకు గురికావడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి, ప్రభుత్వ భూమిని రక్షించడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.స్థానికులు అందించిన ఫోటోలో ఒక నిర్మాణం కొనసాగుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, ఆ స్థలం ప్రభుత్వ దవాఖాన భూమేనని లేదా నిర్మాణం అక్రమమని ఫోటో ఆధారంగా మాత్రమే నిర్ధారించడం సాధ్యం కాదు. దీనిపై సంబంధిత రెవెన్యూ, వైద్యశాఖ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడుతారా? అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

# జూన్ 17, 18 తేదీలలో లియాఫీ ఆల్ ఇండియా

### జనరల్ బాడీని జయప్రదం చేయండి

### జిల్లా అధ్యక్షుడు పులి సుధాకర్ గౌడ్



**నర్సంపేట మే 31 ( జనం సాక్షి** )ఆల్ ఇండియా జనరల్ బాడీ సమావేశం జూన్ 17, 18 తేదీలలో హైదరాబాదు లోని నాగోల్ శుభం కన్వెన్షన్ లో నిర్వహించడానికి, నర్సంపేట లోని లియాఫీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించి, బ్యానర్ లను విడుదల చేశారు. ఆల్ ఇండియా జనరల్ బాడీ మీటింగ్ కి సెంట్రల్ మినిస్టర్ కిషన్ రెడ్డి ని లియాఫీ ఆల్ ఇండియా సెక్రటరీ జనరల్ ఆధ్వర్యంలో ఆహ్వానించారు. ఈ సమావేశంలో లియాఫీ 1964 ఆల్ ఇండియా సెక్రెటరీ జనరల్ ఎస్ బి శ్రీనివాస చారి, ఆధ్వర్యంలో దాదాపు 3500 ఏజెంట్ లీడర్స్ ఆల్ ఇండియా నుండి వస్తారని, మీటింగును సక్సెస్ చేయుటకు నిర్ణయం తీసుకున్నారని. అన్నారు

# మండల కేంద్రంలో ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయాలి

- **30 నుండి40 ఎకరాల్లో పంటలు అగ్నికి ఆహుతి**
- **లక్షల్లో పంట నష్టం జరుగుతుంది**




**చిట్యాల, మే 31( జనం సాక్షి):**వాతావరణంలో వచ్చిన మార్పులను గమనిస్తూ, పంటలకు వచ్చి తెగులను తప్పించి కాపాడి, లోకానికి ఆకలిని, వారికి వెలుగును నింపడమే తప్ప మరే కల్మషం లేని వారు అన్నదాతలు. పత్తి పంట ఆశించిన రీతిలో లేకపోవడంతో, దానిని తొలగించి మొక్కజొన్న వైపు మొగ్గు చూపారు. అది నేడు విద్యుత్ తీగల తోనో, ప్రమాదవశాత్తు మంటల తోనో, చేతికంది వచ్చిన పంటలు అగ్గిపాలు కావడం వాటితో జరుగుతున్నాయి. దీంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది.. ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయాలి. ఫైర్ ఇంజన్ అందుబాటులో లేకపోవడం, ఫైర్ ఇంజన్ స్టేషన్ సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ప్రమాదం సంభవించినప్పుడు, ప్రమాదం జరిగిన చోటికి వెళ్లడానికి అర్థగంట సమయం తీసుకోవడంతో, అవి వచ్చి లోపే పంట పూర్తిగా దగ్ధం కావడం జరుగుతుంది. మండల కేంద్రంలోని ఇప్పటివరకు 30 నుంచి 40 ఎకరాలు పంట నష్టం జరిగింది.టేకుమట్ల మండలం సుమారు 8 ఎకరాల వరకు పంట దగ్ధమైంది. మొగుళ్లపల్లి మండలంలోనీ ఏడు ఎకరాలకు పైన దగ్ధమైంది. రేగొండ మండలంలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. చేతికొచ్చిన పంటలు కాలి బూడిద కావడంతో బాధితులు కన్నీటిపర్వతం అవుతున్నారు..

చిట్యాల మండల కేంద్రంలో ఫైరింజన్లు ఉండాలి .రేగొండ, చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాలకు మధ్యలో చిట్యాల మండలం ఉండడం చేత, మండల కేంద్రంలో కనీసం రెండు ఫైర్ ఇంజన్లు వేసవికాలం దృష్ట్యా అందుబాటులో ఉంటే, ప్రమాదాలు సంభవించినప్పుడు, ఆయా మండలాలకు సమయము, దూరము అనుకూలంగా ఉండి, రైతులు పంటలపై వెచ్చించిన లక్షల విలువగల పంటలను దక్కించుకోవడంతో పాటు, ప్రమాదాల భారీ నుండి నివారించవచ్చును. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి అగ్నిమాపక కేంద్రాన్ని చిట్యాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసి అక్కడి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

# ప్రపంచ పొగాకు నిషేధ దినోత్సవం సందర్భంగా

### అవగాహన కార్యక్రమం



**కాళేశ్వరం , జూన్ 01 , ( జనం సాక్షి )** ప్రపంచ పొగాకు నిషేధ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి. హెచ్. మధుసూదన్ మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, టీబీ, ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుందని తెలిపారు. నోరు, గొంతు, పెదవులు, నాలుక క్యాన్సర్లతో పాటు సంతానోత్పత్తి సమస్యలు, ఎముకల బలహీనత, అకాల వృద్ధాప్యం వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. సిగరెట్లు, గుట్కాలు, పాన్ మసాలా వంటి పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డీఎంహెచ్వో, ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ దేవేందర్, వైద్యాధికారులు డాక్టర్ సుష్మిత, డాక్టర్ వినయ్, అసిస్టెంట్ మలేరియా అధికారి సుధాకర్, సబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఇహెచ్ఎస్ కటింగ్ మొదలు తీవ్రంగా ఖండించిన టిఎస్ యుటిఎఫ్

- **సిఎం జోక్యం చేసుకొని కోతలను రద్దు చేయాలి**
- **టిఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్**




**స్టేషన్ ఘన్పూర్, మే 31 ( జనం సాక్షి) :**ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాలు ఖరారు కాలేదు,హాస్పిటల్స్ తో ఒప్పందం కుదిరింది లేదు, ప్యాకేజి రేట్లు నిర్ణయించలేదు, డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వనే లేదు, ఈహెచ్ఎస్ చందా 1.5 శాతం మినహాయింపు పై జిఒ ఇవ్వనే లేదు కానీ ఆర్థిక శాఖ అత్యుత్సాహంతో ఈహెచ్ఎస్ చందా పేరిట ఉద్యోగుల మే నెల మూల వేతనాల్లో 1.5 శాతం కోత విధించటాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ తీవ్రంగా ఖండించారు.స్టేషన్ ఘనపురం రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లా డుతూ ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాల గురించి అడిగితే ఆరోగ్యశాఖ ఇస్తుందని సమాధా నం చెప్పిన ఆర్థిక శాఖ అధికారులు ఆ విధివిధా నాలు లేకుండానే వేతనాల్లో కోత ఎలా పెడతార ని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబ సభ్యుల వివరాలు ఐఎఫ్ఎంఐఎస్ సైట్ లో ఈరోజు వరకు నమోదు చేయాలని గడువు విధించి, నిన్నటిదాకా వెబ్ సైట్ లో మార్పులు చేస్తూనే ఉన్నారని,వివరాలు పూర్తిగా తీసుకోనే లేదని, పాత నిబంధనల ప్రకారం భార్యాభర్తలు ఉద్యోగులైతే ఒక్కరే చందా చెల్లించాల్సి ఉండగా ఇప్పుడు ఇద్దరి నుంచి మినహాయించారని ఆవేద న వ్యక్తంచేశారు. ఆధారిత కుటుంబ సభ్యులపై స్పష్టత రానే లేదని, ఉద్యోగుల, పెన్షనర్ల ఆరోగ్య సంరక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే కానీ కార్పొరేట్ హాస్పిటల్స్ లో వైద్యం ఖరీదైన సమయంలో ఉద్యోగులు కూడా కొంత భరించాలని ప్రభుత్వం కోరినప్పుడు సంఘాలు అంగీకరించా యని ఆయన తెలిపారు. అయినా వేతనంలో 1. 5 కోత నిర్ణయం పట్ల ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్ర మైన అసంతృప్తితో ఉన్నారని, వారిలో ఉన్న సందేహాలను తొలగించి ఆరోగ్య పథకాన్ని పారద ర్శకంగా అమలుచేయాల్సిన సమయంలో అందు కు తగిన చర్యలు తీసుకోకుండా ఇంత హడావు డిగా వేతనాల్లో కోత విధించడం ఉద్యోగుల్లో పలు అనుమానాలకు తావిస్తున్నదని ఆయన విమర్శిం చారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి వెంటనే జోక్యం చేసుకొని వేతనాల్లో కోతలు నిలివేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఆర్థిక శాఖ తీసుకున్న ఏకపక్ష నియంతృత్వ నిర్ణ యాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాల వుతుందని జయప్రకాశ్ హెచ్చరించారు.

# సామాన్య కుటుంబం నుంచి వైద్యురాలిగా ఎదిగిన యువతి

### డాక్టర్ పట్టా అందుకున్న నారగాని దివ్య



**నడికుడ మే 31 (జనం సాక్షి) :** నడికూడ మండల కేంద్రానికి చెందిన నారగాని అనిత--రమేష్ దంపతుల కుమార్తె నారగాని దివ్య వైద్య విద్యను విజయవంతంగా పూర్తిచేసి డాక్టర్ పట్టా అందుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని శ్రీ సత్యసాయి కాలేజ్ ఆఫ్ హోమియోపతిక్ మెడికల్ సైన్సెస్ అండ్ హాస్పిటల్‌లో హోమియోపతి వైద్య విద్యను అభ్యసి ంచిన ఆమె ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ పట్టాను స్వీకరించారు.సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన తాను కష్టపడి వైద్యురాలిగా ఎదగడం ఆనందంగా ఉందని దివ్య తెలిపారు. భవిష్యత్తులో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. దివ్య డాక్టర్ పట్టా పొందిన సందర్భంగా గ్రామస్తులు, బంధుమిత్రులు ఆమెను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# చిన్నారిని ఆశీర్వదించిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు 'సిద్దన'



**చెన్నారావుపేట, మే31(జనంసాక్షి ):** చిన్నారిని కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్ ఆదివారం ఆశీర్వాదించారు. మండలంలోని లిం గగిరి గ్రామానికి చెందిన దాసరి మధు కుమారుడు రాహుల్ జన్మదిన వేడుకల కార్యక్రమానికి హాజరై మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డితో కలిసి చిన్నారికి తమ ఆశీర్వాదాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, మండల కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి మాదారపు చరణ్ కుమార్, అమీనాబాద్ గ్రామ సర్పంచ్ దార రంజిత్, గ్రామ అధ్యక్షులు మంద సోమయ్య, గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ చీకటి చిన్నరాజు, మాజీ సర్పంచ్ మాదారపు భాస్కర్, ఉపాధ్యక్షులు కూరపాటి సదయ్య, కుక్కల అశోక్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాల్లో నెట్‌వర్క్ నిలిచిపోవడంతో వ్యాపారులకు ఇబ్బందులు



కాళేశ్వరం , జూన్ 01 , ( జనం సాక్షి)జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వ తి అంత్య పుష్కరాల సందర్భంగా మొబైల్ నెట్‌వర్క్ సమస్యలు తీవ్ర ంగా ప్రభావం చూపుతు న్నాయి. పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో టెలికాం నెట్‌వర్క్‌లపై ఒత్తిడి పెరిగి, కాల్స్, ఇంటర్నెట్ సేవలు తరచూ నిలిచిపో తున్నాయి.దీంతో యూపీఐ, ఫోన్‌పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపులపై ఆధారపడే చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భక్తులు నగదు లేకుండా వచ్చిన సందర్భాల్లో చెల్లింపులు చేయలేకపోవడంతో వ్యాపారం దెబ్బతింటోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుష్కరాల సమయంలో మంచి వ్యాపారం జరుగుతుందని ఆశించిన చిన్న వ్యాపారులకు నెట్‌వర్క్ సమస్యలు నిరాశ కలిగిస్తున్నాయి. కొందరు భక్తులు కొనుగోళ్లు చేసిన తర్వాత చెల్లింపుల కోసం నెట్‌వర్క్ రావడానికి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరికొందరు చెల్లింపులు చేయలేక కొనుగోళ్లు రద్దు చేసుకుంటున్నారు. పుష్కరాల వంటి భారీ ఆధ్యాత్మిక కార్యక్రమాల సమయంలో అదనపు మొబైల్ టవర్లు ఏర్పాటు చేసి నెట్‌వర్క్ సేవలను మెరుగు పర్చాలని వ్యాపారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ప్రస్తుతం నెట్‌వర్క్ సమస్యల కారణంగా వ్యాపారం మందగించిందని తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎంపీ వంశీకృష్ణకు స్వాగతం పలికిన మాల సంఘం నేతలు




ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి); ఎంపీ గడ్డంవంశీకృష్ణ ఆదివారం జిల్లా కేంద్రానికి రావడంతోజిల్లా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎంపీకిఘన స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీ బొబ్బిలి సుధాకర్, ల ఆద్వర్యంలో పూల బొకే అందించిశాలువాతో సన్మానించారు.అనంతరం జిల్లాలో మాలలకుపై వర్గీకరణ విషయంలో చాలా అన్యాయం గురించి ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. రోస్టర్ పాయింట్లు 22 లోపు ఒక్క పోస్టు కూడా మాలలకు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పార్లమెంటులో ఈ విషయాన్ని లేవనెత్తి మాలలకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే ఎన్నికలలో మాలల ఓట్లు ఎటు వేయాలో మేము నిర్ణయించుకుంటామని తెలిపారు. అదేవిధంగా జిల్లా శాఖ భవనానికి ప్రహరీ గోడ నిర్మాణా నికి మరియు ఇతర అవసరాల నిమిత్తం రూపాయలు 40 లక్షలుత్వరలోనే అందజేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్, ప్రధాన కార్య దర్శి బొబ్బిలి సుధాకర్, జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీ మేకల మల్లన్న, వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ బేర దేవన్న, మాజీ అధ్యక్షులు సూరం భగవాండ్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పాశం రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 31( జనంసాక్షి ):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం జిల్లాలో పర్యటన నేపథ్యంలో కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణాన్ని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదివారం పరిశీలించారు. ఎమ్మెల్సీ దండే విట్టల్,జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇంచార్జి శ్యామ్‌నాయక్,గ్రంధాలయం చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, మాజీ డీసీసీ అధ్యక్షురాలు పవిశ్వప్రసాద్ రావు , మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి సభా వేదిక, ప్రజలు కూర్చునే ఏర్పాట్లు, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కొఠారి గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన హెలిప్యాడ్ ఏర్పాట్లను కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. అలాగే ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేయనున్న ఇందిరమ్మ ఇండ్లను సందర్శించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యవర్గ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మన ఊరు మనబడి పనుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



నడి కూడ మే 31 (జనం సాక్షి) : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన 'మన ఊరు మన బడి' పనులకు సంబంధించిన బిల్లులు 30 నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని తక్షణమే ప్రభుత్వం స్పందించి మన ఊరు మనబడి నిధులు విడుదల చేయాలని నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూనడికూడ మండల కేంద్రంలోని జడ్‌పీహెచ్‌ఎస్ హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం డైనింగ్ హాల్, ఫ్యాన్లు, లైటింగ్ వ్యవస్థ, మరుగుదొడ్లు, ప్రహరీ గోడ తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే శిథిలావస్థకు చేరుకున్న ఎంపీపీఎస్ పాఠశాల భవనాన్ని గ్రామపంచాయతీ నిధులతో మరమ్మతులు చేసినట్లు తెలిపారు.మండల ఏర్పాటు తర్వాత ఎంపీడీవో కార్యాలయానికి భవనం లేకపోవడంతో ప్రాథమిక పాఠశాల భవనాన్ని కార్యాలయానికి కేటాయించారని, అక్కడి విద్యార్థులను జడ్‌పీహెచ్‌ఎస్‌కు తరలించారని వివరించారు. దీంతో విద్యార్థులు ఒకే గదిలో చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సహకారంతో 'మన ఊరుమన బడి' పథకం కింద కొత్త తరగతి గదులు మంజూరయ్యాయని తెలిపారు.కొత్త విద్యా సంవత్సరానికి ముందే నూతన తరగతి గదులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని, చిన్నారులు ఇరుకు గదుల్లో చదువుకునే పరిస్థితికి ముగింపు పలకాలని రవీందర్‌రావు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

## పవన్ కళ్యాణ్ ఏనాడు తెలంగాణవాదానికి వ్యతిరేకం కాదు

### జనసేనపార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గాదె పృథ్వీ



స్టేషన్ ఘన్పూర్, మే 31 ( జనం సాక్షి ) :జనసేన పార్టీ అధినేత పవ న్ కళ్యాణ్ మీద తెలంగాణవాదుల ముసుగులో కొందరు కుట్ర చేస్తున్నారని జనసేనపార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గాదె పృథ్వీ మండిపడ్డారు.ఆదివారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఏనాడు తెలంగాణవాదానికి వ్యతిరేకం కాదని పేర్కొన్నారు.తెలంగాణ పట్ల వారికి ఉన్న గౌరవం పలు జనసేన సభల్లో గుర్తుచేశారన్నారు. తెలంగా ణ యువత పోరాట పటిమపై ఎన్నో సార్లు గొప్ప గా వ్యాఖ్యనించారని తెలిపారు. అటువంటి వ్యక్తిపై గత వారం రోజులుగా కొందరు విలువలు లేని వ్యక్తులు నీచమైన బాషాతో,అనైతికమైన చేష్టలతోవారిని కించపరిచే విధంగా వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు.దేశ ప్రధాని చేత ప్రశంసలు పొందిన వ్యక్తిత్వం కలిగి కోట్ల మంది అభిమానులు ఉన్న అగ్ర నటుడు అయినటువంటి పవన్ కళ్యాణ్ మీద తెలంగాణ వ్యతిరేకి అనే ముద్ర వేయాలని కొందరు సంఘ విద్రోహులు కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. జర్నలిస్ట్ ముసుగులో కొన్ని పెయిడ్ యూట్యూబ్ చానెల్స్ జనసేనను టార్గెట్ చేసి తప్పుడు ప్రచా రం చేస్తున్నారని తెలిపారు.పవన్ కళ్యాణ్ ను విమర్శించే వాళ్ళు ఒకసారి ఆత్మ విమర్శ చేసుకో వలని ఎద్దేవా చేశారు.తెలంగాణ రాష్ట్రానికి ఏ విపత్తవచ్చిన కోట్ల రూపాయలు విరాళాలు, ఇటీ వల కొండగట్టు అభివృద్ధికై 39 కోట్లు ఇచ్చినట్లు గుర్తు చేశారు. అసత్య ఆరోపణలు చేసిన వారు బేషరత్తుగా పవన్ కళ్యాణ్ కు బహిరంగ క్షేమాప ణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అమాంచ సునీల్,మెడిద ప్రశాం త్,రాజోజు రాజశేఖర్,అక్కెనపల్లి సాయి, రాజేష్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



హనుమకొండ, ప్రతినిధి మే 31, (జనం సాక్షి) :ధూమపానం మరియు పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య పిలుపునిచ్చారు.ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో అవగాహన సదస్సు, వివిధ రకాల పోస్టర్ల ప్రదర్శనతో పాటు హెడ్ పోస్ట్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులు, సినిమా హాళ్లు, మార్కెట్లు వంటి బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం వల్ల చుట్టూ ఉన్నవారికి కూడా తీవ్ర ఆరోగ్య ప్రమాదం కలుగుతుందని, ఇది ప్రతి ఒక్కరూ గమనించాల్సిన విషయమని తెలిపారు.పోలీస్ శాఖ సహకారంతో నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయించే దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారికి సిగరెట్ మరియు ఇతర పొగాకు నియంత్రణ చట్టం సెక్షన్ 4 ప్రకారం జరిమానా విధించబడుతుందని తెలిపారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో యువతకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విద్యాసంస్థల పరిసరాల్లో 100 గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను నిరోధించేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖలు మరియు కమిటీ సభ్యుల సహకారంతో చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రామక శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం పొగాకు వినియోగంలో రెండవ స్థానంలో ఉందని, ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా సుమారు 80 లక్షల మంది పొగాకు సంబంధిత వ్యాధులతో మరణిస్తున్నారని తెలిపారు. ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ధూమపానం మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల ఊపిరితిత్తులు మాత్రమే కాకుండా శరీరంలోని దాదాపు అన్ని అవయవాలపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎన్ సి డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి. రాజిరెడ్డి, హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ డి-అడిక్షన్ సెంటర్ నిర్వాహకులు రాము, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, ఎన్సిడి సోషల్ వర్కర్ నరేష్, సూపర్వైజర్ శ్రీనివాస్ రెడ్డి, పోచమ్మకుంట లస్కర్ సింగారం, జిడబ్ల్యూఎంసి హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎం ఆశా కార్యకర్తలు, వాకర్స్ మరియు పలువురు సందర్శకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల నూతన కార్యవర్గం ఎన్నిక



**బెల్లంపల్లి, మే 31, (జనంసాక్షి)**బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి గని కార్మిక సంఘం కార్యాలయ ఆవరణలో ఆదివారం మున్సిపల్ కార్మికుల నూతన కార్యవర్గాన్ని కరెంగుల రామస్వామి అధ్యక్షతన ఎన్నుకున్నారు. మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షునిగా రాళ్లబండి సురేష్, ప్రధాన కార్యదర్శిగా కరెంగుల రామస్వామితో పాటు 19మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా గత పోరాటాలను సమస్యలను కార్మికులు పొందవలసిన హక్కులను గురించి జనరల్ బాడీ సమావేశం చర్చించారు. 60 ఏళ్ళు నిండిన వారిని తొలగించి వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవాలని, కనీస వేతనం 26000 ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని తీర్మానం చేస్తూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అత్యవసర సర్వీసుల కింద ఉన్న మున్సిపల్ కార్మికులు కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారని, వారికి ఈఎస్ఐ, ఈపీఎఫ్ లేకపోవడం దారుణం అన్నారు. మునిసిపాలిటీ జనాభాను ఆధారం చేసుకొని నియమించాల్సిన కార్మికుల్ని నిబంధనలు మేరకు నియమించకుండా తక్కువ మంది కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తూ, పని భారం పెంచి తీవ్రమైన అనారోగ్యాలకు కారణమవుతుందని ఆరోపించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ జనాభా ప్రాతిపదికన అదే నిష్పత్తిలో నూతన కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో 120 మంది కార్మికులు పనిచేస్తున్నా వారికి ఉద్యోగ భద్రత లేదని అన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల పెండింగ్ సమస్యలపై దశలవారీగా ఆందోళన పోరాటాలు కొనసాగించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, ప్రజాప్రతినిధులు చొరవ చూపి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ సలహాదారుడు నీరటి రాజన్న, బెల్లంపల్లి యూనియన్ బాధ్యుడు టీ జైపాల్ సింగ్, సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు టి మణిరామ్ సింగ్, అంబాల మహేందర్, గోగర్ల శంకర్, ఎండి చాంద్ పాషా, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జన్మదినం సందర్బంగా అన్నదానం



**బెల్లంపల్లి, మే 30, (జనంసాక్షి)**బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జన్మదినం సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద అమ్మఒడి ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణ బిఆర్ఎస్ నాయకులు సాన శ్రావణ్, కొట్టె వినయ్, కొట్టె రాకేష్ సహకారంతో అన్నదానం చేపట్టారు. ఈసందర్భంగా అమ్మఒడి ఎన్జిఓ మేనేజర్ హనుమండ్ల మధుకర్ మాట్లాడుతూ అమ్మఒడి ఆధ్వర్యంలో ఇప్పటి వరకు దాతల సహకారంతో 387వ సారి అన్నదానం చేపట్టామని తెలిపారు. కరోన మహమ్మారి ఉధృతంగా ఉన్న సందర్భంలో అన్నదానం చేయాలని తలంచి పుట్టినరోజు వేడుకలు, జ్ఞాపకార్థం సందర్భాలు, ఇతర సంతోష క్షణాలు పదిమందికి ఉపయోగ పడేలా ఉండాలని ఈకార్యక్రమం చేపట్టినట్లు ఆయన వివరించారు. ఈకార్యక్రమం ద్వారా 200 మందికి అన్నదానం చేసినట్లు వివరించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకులు, అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, గన్నెవరం తిరుమల చారి, చెందుపట్ల లింగమూర్తి, ఎండీ యుసుఫ్ పాల్గొన్నారు.

## వినతిపత్రం అందగానే స్పందన.. వేణ్కటాద్రిపేట్‌లో కొత్త బోర్ పనులకు శ్రీకారం. అప్పాల గణేష్



**నిర్మల్,మే31(,జనంసాక్షి)** నిర్మల్ పట్టణంలోని వేణ్కటాద్రి పేట్ (వార్డు నెం. 6) ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కొత్త బోర్ ఏర్పాటు పనులు ప్రారంభ మయ్యాయి.తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం సంబంధిత వార్డు కాలనీ వాసులు, పెద్దలు మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన వెంటనే ఆయన సమస్యను పరిశీలించి, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తక్షణమే నూతన బోర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కొత్త బోర్ పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభోత్సవం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వేగంగా స్పందించి చర్యలు చేపట్టినందుకు స్థానిక నాయకులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు మున్సిపల్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తెలిపారు.

## ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు

### కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 31(జనంసాక్షి ):**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు సభా స్థలం, పార్కింగ్ ప్రదేశాలు, వీఐపీ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, హెలిప్యాడ్ ప్రాంతం, ట్రాఫిక్ మార్గాలు తదితర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పర్యటన సందర్భంగా భద్రతా నిర్వహణ కోసం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బందోబస్తులో 2 మంది అదనపు ఎస్పీలు, 11 మంది డీఎస్పీలు, 44 మంది సీఐలు,ఆర్ఐలు, 157 మంది ఎస్ఐలు,ఆర్ఎస్ఐలు,డబ్ల్యూఎస్ఐలు, 200 మంది ఏఎస్ఐలు,హెడ్ కానిస్టేబుళు ,, 829 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 43 మంది మహిళా పోలీసు సిబ్బంది, 328 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. అదనంగా 9 ప్రత్యేక పార్టీలు, 2 రోప్ పార్టీలు, 28 యాక్సెస్ కంట్రోల్ బృందాలు, 10 బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ బృందాలను మోహరించినట్లు తెలిపారు. మొత్తం 1,825 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ముఖ్య మంత్రి పర్యటన భద్రతా ఏర్పాట్లలో పాల్గొంటారని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి, ట్రాఫిక్,భద్రతా నియమాలను పాటించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ విజ్ఞప్తి చేశారు.

## వర్షాకాల సాగుపై రైతులకు అవగాహన సదస్సు



**దిలావర్పూర్, మే 30, (జనం సాక్షి):**మండలంలోని మాడెగాం గ్రామంలో సర్పంచ్ మారుతీ పటేల్ అధ్యక్షతన వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రాబోయే వానాకాలంలో ఎలాంటి విత్తనాలు వాడాలి, ఎక్కడ కొనాలి, బిల్లులను భద్రపరచుకోవడం కోవడం, మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడడం వలన కలిగే అనర్థాలు, పంటల అవశేషాలను కాల్చడం వలన వచ్చే నష్టాలు,,, దానికి ప్రభుత్వం జీవో నెంబర్ 27 ద్వారా విధించే జరిమానాల గురించి. నకిలీ విత్తనాలు, వ్యవసాయ అధికారుల వద్ద పంట నమోదు ప్రక్రియ గురించి, సేంద్రియ వ్యవసాయం యొక్క ఆవశ్యకతను, వ్యవసాయ శాఖ రైతులకు అందించు సేవల గురించి వివరించిన వ్యవసాయ అధికారులు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి, తేజస్విని వ్యవసాయ విస్తరణ అధికారి రైతులు పాల్గొనడం జరిగింది.

## కాసిపేటలో ఘనంగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జన్మదిన వేడుకలు

**కాసిపేట, మే 31 : (జనం సాక్షి )** కాసిపేట మండలంలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాసిపేట మండల కేంద్రంతో పాటు దేవాపూర్ మేజర్ పంచాయతీ, ముత్యంపల్లి, కాసిపేట, కొండాపూర్, ధర్మారావుపేట తదితర గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. అనంతరం మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్వయంగా కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వచ్చే ఎన్నికల్లో సత్తా చాటుతారని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బొల్లు రమణారెడ్డి, కోనూర్ సర్పంచ్ పేరం మల్లేష్, మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, బీఆర్ఎస్ మండల జనరల్ సెక్రెటరీ మోటూరి వేణు, మాజీ ఎంపీటీసీ ఏనుగు మంజులారెడ్డి సుధాకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటెంకి వాల్దేవ్, భారీగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సత్యపాల్ రావు నాయకత్వంలో పనిచేస్తాం



**కాసిపేట మే 31 ( జనం సాక్షి )**ఓరియంట్ అదానీ సిమెంట్ యూనియన్ అధ్యక్షులు కొక్కిరాల సత్యపాల్ రావు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని ప్రజా సేవాకు ఆకర్షితులై వారి నాయకత్వంలో పని చేస్తామని దేవాపూర్‌కు చెందిన మైనార్టీ నాయకులు షాకీర్, కలీం కలిసి మద్దతు తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం సేవలందిస్తున్న కొక్కిరాల సత్యపాల్ రావు గారి వెంట నడుస్తూ, దేవాపూర్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. వారికి శాలువా కప్పి కొక్కిరాల సత్యపాల్ రావు స్వాగతం పలికారు. డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల కృష్ణ, సర్పంచి సీడం రాందాస్, మాజీ ఎంపీటీసీ పార్వతి మల్లేష్, మహేందర్, మెరుగు శంకర్, సత్యనారాయణ,అన్నం కుమార్, కనక రాజు రాజిరెడ్డి,జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు

## మున్నూరుకాపు సంఘం దేవాపూర్ అధ్యక్షునిగా భారతాని సతీష్



**కాసిపేట, మే 31 : జనం సాక్షి**కాసిపేట మండలంలోని దేవాపూర్ మేజర్ పంచాయతీ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులుగా భారతాని సతీష్ ఎన్నికయ్యారు. ఆదివారం కాసిపేట మండలం దేవాపూర్ లో మున్నూరు కాపు సంఘం కాసిపేట మండల అధ్యక్షులు అట్టెపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన దేవాపూర్ మేజర్ పంచాయతీ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా భారతాని సతీష్, గౌరవాధ్యక్షులుగా మచ్చ పోషం, అన్నం మల్లయ్య, పోతురాజుల గౌరయ్య, మామిడి శ్రీనివాస్, కొవ్వూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా అన్నం కుమార్, మచ్చ అనిల్, పిడుగు మనోహర్, జనరల్ సెక్రెటరీగా మేకర్తి సత్యం, కోశాధికారిగా అగ్గు శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీగా ఆకుల సాయికుమార్, పెద్దింటి రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కాసర్ల సురేందర్, ముత్యాల రమేష్, గుర్రాల రమేష్, ముఖ్య సలహాదారులుగా ఆకుల సత్తయ్య, కొండ అంకుల్, పెద్దపల్లి రాజు, కొమ్ము రవీందర్, జిల్లాల శంకర్ లను ఎన్నుకున్నారు.

# ఉపాధ్యాయుల జీతాలలో కోతలు విధించడం సమంజసం కాదు

## తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం



**తొర్రూరు, మే 31 (జనం సాక్షి):** హెల్త్ కార్డుల జారీ విషయంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మానుకోట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంజిరాల నాగరాజు ,గుడిబోయిన గోపికృష్ణ మాట్లాడుతూ హెల్త్ కార్డుల పేరుమీద ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించకుండానే హాస్పిటల్స్ తో సమావేశం జరుపకుండానే ఉపాధ్యాయ సంఘాలకి హెల్త్ కార్డ్ యొక్క నామ్స్ తెలియజే యకుండానే ఉపాధ్యాయుల నుండి వసూలు చేసే ప్రీమియం రక్షణ ఉపాధ్యాయులని మోసగించే విధంగా ఉపాధ్యాయులకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారికంగా కార్డులు జారీ చేయకుండా హెల్త్ కార్డు యొక్క విధి విధానాలు విడుదల చేయకుండా ఉపాధ్యాయుల జీతభత్యాలనుండి హెల్త్ కార్డు ప్రీమియం పేరుతో జీతాలలో కోత విధించడం సమంజసం కాదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వం ఉపాధ్యాయుల నుండి వసూలు చేసిన ప్రీమియం ని వెనుకకి పంపుతూ అధికారికంగా కార్డులు జారీ చేసిన తర్వాత విధివిధానాలు విడుదల చేసిన తర్వాత ప్రీమియం సంబం ధించిన డబ్బులు జీతాల నుండి కోత విధిస్తే సరైన విధంగా ఉంటుందని తెలియ జేయడమైనది ప్రభుత్వం ఈ స్కీం ఇష్టం లేని వారికి స్కీము నుండి మిన హాయిం పు ఇవ్వాలి భార్య భర్తలు ఇద్దరు ఉద్యోగులైనప్పుడు ఒకరి నుండి మాత్రమే ప్రీమియం వసూలు చేయాలి యువతి యువకులకి హెల్త్ కార్డు వర్తించే విధంగా 25 నుండి 35 సంవత్సరాలకు వయోపరిమితి పెంచాలి అదేవిధంగా ఒకే రకమైనటువంటి ప్రీమియమును సీనియర్ జూనియర్ తేడా లేకుండా అందరూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రీమియం చెల్లింపు వర్తింపజేసే విధంగా విధానం ఉండాలని కోరడమైనది.

# బంగల్‌పేట్‌లో కోతుల బెడదకు చెక్.. రెండు రోజుల్లో 123 కోతుల పట్టివేత

## మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి



**నిర్మల్ టౌన్, మే 31:(జనంసాక్షి)**నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్ ప్రాంతంలో కోతుల బెడదను నివారించేందుకు మున్సిపల్ అధికారులు చేపట్టిన ప్రత్యేక కోతుల పట్టివేత కార్యక్రమం రెండవ రోజు విజయవంతంగా కొనసాగింది.మొదటి రోజు 65 కోతులను పట్టుకున్న అధికారులు, రెండవ రోజు మరో 58 కోతులను సురక్షితంగా పట్టుకున్నారు. దీంతో రెండు రోజుల వ్యవధిలో మొత్తం 123 కోతులను పట్టుకోవడం సాధ్యమైంది. ఈ కార్యక్రమం నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించబడగా, వార్డ్ కౌన్సిలర్ పెండం శ్రీనివాస్ చురుకుగా పాల్గొని కోతుల పట్టివేత ప్రక్రియలో కీలక పాత్ర పోషించారు.కోతుల కారణంగా తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న బంగల్‌పేట్ ప్రజలకు ఈ చర్యతో గణనీయమైన ఉపశమనం లభించింది. కోతుల బెడద తగ్గుముఖం పట్టడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ మున్సిపల్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అన్నదాతకు అడుగడుగునా అవాంతరాలు

## అన్నదాత వడ్లు పశువుల పాలు :వరి అమ్మకంలో రైతుల అష్టకష్టాలు



**కాటారం మే 31 (జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా దేవరంపల్లి కేంద్రంలో వడ్లను పశువులు మేస్తున్నాయి . ఆరుగాలం శ్రమించి పంటను పండించిన అన్నదాతకు చివరకు తన పంటను అమ్ముకోవడమే ప్రహసనంగా మారుతోంది. విత్తనం వేసిన నాటి నుంచి కోత వరకు ఎన్నో కష్టనష్టాలను భరించిన రైతులు, పండిన ధాన్యాన్ని విక్రయించే సమయంలో మరిన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.పొలాల నుంచి వరి కల్లాల వరకు ధాన్యాన్ని తరలించడానికే రైతులు నానా తంటాలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన తర్వాత కూడా వారికి ఉపశమనం లభించడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పూర్తిస్థాయిలో అందకపోవడంతో పాటు మధ్యదళారుల దోపిడీ రైతులను తీవ్రంగా నష్టపరుస్తోంది.మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా, బస్తాకు రెండు నుంచి మూడు కిలోల వరకు తరుగు పేరిట కోత విధిస్తున్నారు. మరోవైపు హమాలీల కాంటా జిమ్మిక్కులతో రైతులకు అదనపు నష్టం వాటిల్లుతోంది. ఫలితంగా కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతన్న మోసపోతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం డివిజన్ పరిధిలో గల కాటారం, మహాముత్తారం, మల్హర్ మహదేవ్‌పూర్, పలిమెల మండలాల రైతులు ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వరి కల్లాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించడం రైతులకు తలకు మించిన భారంగా మారింది.అంతేకాకుండా, ధాన్యం విక్రయించిన తర్వాత రైతుల ఖాతాల్లో నగదు జమ కావడంలోనూ జాప్యం జరుగుతోందని రైతులు వాపోతున్నారు. ప్రతి దశలోనూ పైసల పర్సెంటేజీలు, అక్రమ వసూళ్లు రైతులపై మరింత భారాన్ని మోపుతున్నాయి. రైతాంగం ఎదుర్కొంటున్న ఈ సమస్యలను పరిష్కరించి, మద్దతు ధరతో పాటు పారదర్శక కొనుగోలు వ్యవస్థను అమలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు."అన్నం పెట్టే రైతు కన్నీరు పెడుతుంటే పట్టించుకునే నాధుడే కరువయ్యాడు" అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రాయకుంట ఆక్రమణ పై చర్యలు తీసుకోవాలి



**ఆత్మకూర్, మే 31 (జనం సాక్షి):** ఆత్మకూరు శివారులోని రాయకుంట ఆక్రమణపై రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పొలాలకు నీళ్లు పెట్టె నిరటీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం ఆత్మకూరు లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల క్రితం 10ఎకరాల్లో ఉన్న రాయకుంట ప్రస్తుతం ఎకరం కూడా లేదని అన్నారు. దీంతో దిగువన ఉండే పంట పొలాలకు నీరు అందించలేక ఆత్మకూరు పెద్ద చెరువు పై ఆధారపడాల్సి వస్తుందని, ఖరీఫ్ పంట మాత్రమే పండుతుందని, రబీ పంట సాగుచేయడానికి నీళ్లు సరిపోవడం లేదని అన్నారు. కుంట ఆక్రమణపై రెవెన్యూ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి కుంట ఆక్రమణపై సర్వే చేపించి, కుంట ఆక్రమించి అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై చర్యలు తీసుకొని పట్టా రద్దు చేసి కుంట ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో నిరటీలు సంపత్, బుచ్చికొమురు, బుజమ్మ, తదితరులు పాల్గొన్నారు..

# టూరుకు వెళదాము రండి. డి. ఎం.పండరి



**నిర్మల్ ,మే31,(జనంసాక్షి)** ఆర్టీసీ నిర్మల్ డిపో ఆధ్వర్యంలో జూన్ 5 వ తేదీ రోజు మన నిర్మల్ బస్టాండ్ నుండి అరుణాచలం, రామేశ్వర్పం సూపర్ లగ్జరి యాత్ర బస్సు వెళు తున్నట్లు డిపోమేనేజర్ తెలిపారు.ఈ బస్సు నిర్మల్ నుండి మ!! ఒంటి గం!! కు బయలుదేరి కానిపాకం, అరుణాచలం, శ్రీరంగం, పలని, పాతాళషెంబు, మధురై, రామేశ్వరం వెళ్లి తిరిగి 10 వ తేదీ రోజు నిర్మల్ తిరిగి వస్తుందని, ఛార్జి ఒకరికి పోను రాను కలిపి 7500/- ఉంటుందని ఆయన తెలిపారు. తక్కువ సీట్లు మిగిలి ఉన్నాయి.ఆసక్తి కలవారు ఫోన్ ద్వారా అయితే ఆన్‌లైన్ ద్వారా కాని లేదా మన నిర్మల్ బస్టాండ్ కౌంటర్ లో కాని ముందుగా బుక్ చేసుకోవాలని మరిన్ని వివరాలకు 9959226003, 7382842582. లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

# పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం



**దస్తురాబాద్,మే 31 (జనంసాక్షి):**మండలంలోని మున్యాల, రేవోజీపేట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఏడు సంవత్సరాలపాటు విధులు నిర్వహించి ఇటీవలే ప్రభుత్వం చేపట్టిన బదిలీలో భాగంగా వేరే గ్రామానికి బదిలీపై వెళ్లిన గ్రామపంచాయతీ కార్యదర్శి గోవర్ధన్ ను గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి గోవర్ధన్ ను ఉద్దేశించి ఏడు సంవత్సరాల పాటు గ్రామానికి అందించిన సేవలను గుర్తుచేసుకొని గ్రామస్తులు కొనియాడారు. ముస్ముందు వెళ్లిన గ్రామపంచాయతీకి కూడా ఇలాంటి సేవలను అందించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కార్యదర్శికి సర్పంచ్ కోలా మహేష్, కట్కూరి లలితరాజేష్ పూలమాలలు శాలువలతో ఘనంగా సత్కరించారు. తమ సేవలను గుర్తించుకొని ఘనంగా సన్మానించిన సర్పంచ్ లకు, గ్రామస్తులకు కార్యదర్శి గోవర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యూత్ సభ్యులు, యువకులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా కృషి చేయాలి

## ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిర్నంది సర్పంచ్



**ఖానాపూర్ రూరల్ 31 మే (జనం సాక్షి):** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా కృషి చేయాలి అని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో ఖానాపూర్ మండలం బిర్నంది సర్పంచ్ నవీన్ యాదవ్ చేరారు, బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీ లో చేరిన సర్పంచ్ నవీన్ యాదవ్ అధికార పార్టీ చేస్తున్న కార్యక్రమాలకు మరియు ,ఎమ్మెల్యే బొజ్జు పటేల్ నియోజకవర్గాన్ని చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ లో చేరుతున్నాం అని అన్నారు.కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పతకాలను ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్,కడెం మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులు పేదలకు వరం...ఆపదలో అండగా ప్రజా ప్రభుత్వం



**గంగారం మే 31 (జనం సాక్షి)**ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన గంగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్భంగా అధ్యక్షులు జాడీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు గంగారం మండలంలో దుబ్బగూడెం గ్రామానికి చెందిన గోపు భరత్ కు 35000/ రూపాయల చెక్కును పోనుగొండ్ల గ్రామానికి చెందిన పే రామ్ చరణ్ తేజ కు 60000/ రూపాయలు విలువ గల చెక్కులను లబ్ధిదారులకు మండల కాంగ్రెస్ పార్టీ బృందం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముడిగే వీరభద్ర పోతయ్య, గుంట రామారావు, జెజ్జరి రాము పూనెం సంధ్య సందీప్, పార్టీ అధికార ప్రతినిధి బూర్కా యాదగిరి, మండల నాయకులు శ్రీను యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈసం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ‘పెరుగన్నం’ సంతృప్తినిస్తున్నది

● **మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు**

**మంచిర్యాల, మే 31 (జనంసాక్షి) :** మండుటెండలో రాకపోకలు సాగించే వారికి 31 రోజుల పాటు పెరుగన్నం పంపిణీ చేశామని, ఈ కార్యక్రమం ఎంతో సంతృప్తినిస్తున్నదని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. నడిపెల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంచిర్యాలలోని ఐబీ చౌరస్తాలో ప్రభుత్వ దవాఖాన ఎదురుగా మే ఒకటో తేదీన ప్రారంభించిన దివాకరన్న పెరుగన్నం పంపిణీ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పెరుగన్నం తిన్నారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన మంచిర్యాలకు వివిధ పనుల నిమిత్తం చుట్టు పక్క ప్రాంతాల నుంచి వేలాది మంది ఇక్కడికి వస్తుంటారని, వేసవికాలంలో వారి ఆరోగ్యానికి మేలు చేసేలా పెరుగన్నం పంపిణీ కార్యక్రమాన్ని కొన్నేళ్లుగా చేపడుతున్నామన్నారు. నెల రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులు, అభిమాను లు పాల్గొని విజయవంతం చేశారని, వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేటర్లు పెట్టెం స్వరూప, లక్ష్మణ్, సత్తా ర్, నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, తోట తిరుపతి, ఒడ్నాల రవీందర్, జాడి భానుచందర్, పుప్పాల స్వర్ణకార్, బలికొండ రమేశ్, మంతేన గట్టయ్య, నక్క తిరుపతి, మనోహర్, ప్రవీణ్ పాల్గొన్నారు.





## మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బిజెపి నాయకులు

**ఖానాపూర్ రూరల్ 31 మే (జనం సాక్షి):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోది 134వ మన్ కీ బాత్ కార్యక్రమన్ని సింగపూర్ లోని 182 వ బూత్ లో ఆదివారం బి జె పి నాయకులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్ ,సింగపూర్ భాజపా బూత్ అధ్యక్షులు అలిశెట్టి రాజశేఖర్,మండల ఉపాధ్యక్షులు పుప్పాల పవన్,బీజేపీ నాయకులు సిద్ధి నవీన్,బొజ్జ రాకేశ్,పన్నెల వెంకటరమణ,ఆకుల వెంకటేష్,తోట సత్యం,సిద్దు, మనోహర్,చింటూరి శేఖర్,బైరి మల్లేష్,ప్రసాద్, రాజన్న,తదితరులు ఉన్నారు.

## చెరువులో అనుమాదాస్పదంగా వ్యక్తి మృతి



**లక్ష్మణ చందా, మే 31 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని పులి కుంట చెరువులో ఆదివారం రోజున ఉదయం ఒక వ్యక్తి అనుమాదాస్పదంగా మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన వివరాలను పరిశీలిస్తే ఆదివారం ఉదయం పోలీస్ స్టేషన్ కి వచ్చిన సమాచారం మేరకు లక్ష్మణ చందా లో గల పులి కుంట చెరువు వద్దకి వెళ్లి చూడగా తోకల. చిన్న లింగన్న, వయస్సు 40, కులం : గుండ్ల, అను అతను చెరువు లో వల చుట్టుకుని చనిపోయి కనిపించాడు. అతని భార్య లక్ష్మి ఇచ్చిన ధరఖాస్తు మేరకు చేపల పట్టడానికి వచ్చి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయి ఉంటాడు. అనే దాని మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణి తెలిపారు. విచారణ లో భాగం గా పోస్టుమార్టం రిపోర్ట్ మరియు ఫోరెన్స్ రిపోర్ట్ లో ఆధారంగా తదుపరి చట్ట పరమైన చర్యలు ఉంటాయి అని తెలిపారు.

## ఇహెచ్ఎస్ పేరుతో వేతనంలో అప్రకటిత కోత సరికాదు

**డిటిఎఫ్ మండల అధ్యక్షులు అంగోతు భద్రయ్య...**



చెన్నారావుపేట, మే 31 ( జనం సాక్షి): ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించి విధివిధానాలు ఖరారు కాకముందే, జీవో విడుదల చేయకముందే ప్రభుత్వ ఉద్యోగుల,ఉపాధ్యాయుల,పెన్షనర్ల మే నెల వేతనం నుంచి బేసిక్ పే లో 1.5 శాతం కోత విధించడం సరికాదని కట్ చేసిన వేతనం వెంటనే ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ అధ్యక్షులు అంగోతు భద్రయ్య, ప్రధాన కార్యదర్శి రావుల ఉమాశంకర్ లు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగుల ఆరోగ్య పథక అమలుకు సంబంధించి ఎంప్లాయ్ హెల్త్ కేర్ ట్రస్ట్ సమావేశమై విధివిధానాలు ఖరారు చేయకుండానే, వైద్య చికిత్స అందించే ఆసుపత్రుల లిస్టు ప్రకటించకుండానే, అందించే వైద్య సేవల గురించి స్పష్టత ఇవ్వకుండానే, భార్యాభర్తలు, పెన్షనర్ల వేతనాల నుండి మినహాయింపులు ఎలా చేయాలో ప్రకటించకుండానే, ఎవరిని సంప్రదించకుండానే, ఆర్థిక శాఖ అత్యుత్సాహంతో మే నెల వేతనంలో కోత విధించడం సరికాదన్నారు. ఈనెల 31వ తేదీ వరకు హెల్త్ కార్డుల సమాచారము ఆన్ లైన్ లో నమోదు చేయాలని, రోజుకో సవరణతో గందరగోళం సృష్టిస్తూనే ఇలా ఉన్నట్లుండి వేతన కోతను విధించడం ద్వారా ఉపాధ్యాయ, ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. కావున ఉద్యోగుల ఆరోగ్య పథకం విషయమై స్పష్టమైన విధివిధానాలు, మార్గదర్శకాలు ప్రకటించేంతవరకు ఉద్యోగుల వేతనాల్లో కోత విధించరాదని, కోత విధించిన మొత్తాన్ని వెంటనే వారి యొక్క ఖాతాల్లో జమ చేయాలని కోరారు.

## అధికారులు రైతులను ఇబ్బందులు పెడితే సహించం

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్**



**నెరడిగొండ మే31(జనంసాక్షి):** జొన్న కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న రైతులకు లారీల కొరత లేకుండా సంబంధిత అధికారులు చూడాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. ఆదివారం రోజున సారు మమ్మల్ని కాపాడు అంటూ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ ఇంటికి రైతులు భారీగా చేరుకొని లారీల కొరత ఏర్పడకుండా చూడాలని రైతులు విన్నవించి,జొన్న రైతులు లారీల కొరత వల్ల రైతుల వద్ద లారీల డ్రైవర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. లారీల కొరతను తీర్చాలని,లారీ డ్రైవర్లు చేస్తున్న డిమాండ్ పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## వామ్మో జూన్...

ఎల్కేజీ నుంచి పదో తరగతి వరకు, ఇంటర్మీడియట్ కు టర్మ్ ఫీజులు, రవాణా, ఇతర ఖర్చులు కలిపితే పదిహేను వేల నుంచి యాభై వేల వరకు అవుతుంది. కార్పొరేట్ స్థాయికి వెళితే లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుంది. మంచిర్యాల జిల్లాలోకి కార్పొరేట్ పాఠశాలలు కూడా రావడంతో పిల్లల చదువుల కోసం మధ్యతరగతి కుటుంబాలు కూడా మొగ్గు చూపుతున్నారు. ఇంజనీరింగ్ చదవాలంటే కూడా కళాశాలల్లో ఫీజు రీఎంబర్స్మెంట్ మినహాయించిన కళాశాలల ఫీజులు లక్షల్లోనే ఉన్నాయి. మరోవైపు హాస్టల్ ఫీజులు అదనపు భారం ఉంటాయి. ప్రైవేట్ పాఠశాలల్లో స్కూల్ ఫీజులు వేలల్లో ఉన్నాయి. దీనికి తోడు ఈవెంట్స్ పేరుతో అదనపు వసూళ్లు కూడా ఉన్నాయి. పుస్తకాలతో పాటు బ్యాగులు, టిఫిన్ బాక్సుల రేట్లు కూడా మండిపోతున్నాయి.

**వ్యవసాయమా... పిల్లల చదువా...**

విద్యా సంవత్సరం ఒకవైపు, వ్యవసాయ పనుల ప్రారంభం మరోవైపు తరుముకొస్తుంది. వ్యవసాయానికి పెట్టుబడికి అప్పులే చేయాల్సి రావడం, పిల్లల చదువులకు కూడా అప్పులు చేయాల్సి రావడంతో రైతు కుటుంబాలు రెండు సమస్యలు ఒకేసారి రావడం రైతు కుటుంబాలకు కత్తి మీద సాము చేయడం వంటిదే. సర్కారు బడుల్లో చదివిస్తే అందరు చులకనగా చూస్తున్నారని, ప్రైవేట్ బడుల్లో చేర్పిస్తే వ్యవసాయంలో నష్టాలు, చదువులకు అప్పులు తోడై ఇంకా అప్పుల ఊబిలో కురుకుపోతున్నారు. ప్రభుత్వం ప్రైవేట్ బడుల్లో ఫీజులను నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## చిన్నారి మ్రిదారాజ్ పుట్టిన రోజు వేడుకలు



● **మ్రిదా రాజ్ ను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

తొర్రూరు, మే 31 (జనం సాక్షి ):తొర్రూర్ మున్సిపల్ కౌన్సిలర్ చకిలేల అలివేణి నాగరాజు దంపతుల మనవరాలు బిఆర్ఎస్ యువ నాయకులు చెక్ వేల మణిరాజ్ రాధా దంపతుల గారాలపట్టి చిన్నారి మ్రిదారాజ్ మొదటి పుట్టిన రోజు వేడుకలు శనివారం సాయంత్రం హైదరాబాద్ గండిపేట ఓగా కన్వెన్షన్ హాల్లో అంగ రంగ వైభవంగా నిర్వహించినారు. పుట్టినరోజు వేడుకలలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించినారు. మాజీ మంత్రి తో పాటు పాలకుర్తి నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు తొర్రూరు మున్సిపల్ మణి రాజ్ బంధుమిత్రులు నాయకులు కౌన్సిలర్ లు పాలకుర్తి నియోజకవర్గ, ప్రజా ప్రతినిధులు పాల్గొని చిన్నారి నీఆశీర్వదించినారు.

## గాలివాన బీభత్సం

నెన్నెల, మే 31 (జనంసాక్షి) : మంచిర్యాల జిల్లాలో పలుచోట్ల ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. మందమర్రి మండలం సారంగపల్లి, చిర్రకుంట,మామిడిగట్టు, ఆదిల్‌పేట, పొన్నారం గ్రామాల్లో మధ్యాహ్నం ఒక్కసారిగా గాలివానతో పాటు వర్షం పడింది. అక్కడక్కడా చెట్లు విరిగిపడ్డాయి. మామిడిగట్టుకు చెందిన గుర్రం వెంకటేశ్‌గౌడ్‌కు చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. ఆదిల్‌పేటలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కరెంట్ తీగలు తెగిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సర్పంచ్ నెండుగురి పున్నం దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించారు. పలుచోట్ల కొనుగోలు క్ష?రందాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. షరతులు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. నెన్నెల మండలం కొత్తూరు గ్రామంలోని మొదటి వార్డులో పోశం ఇంటి సమీపంలో తాటిచెట్టుపై పిడుగు పడడంతో మంటలు లేచాయి. గాలిదుమారానికి జెండా వెంకటపూర్‌లో చెట్ల కొమ్ములు విరిగిపడడంతో 15 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. పలుచోట్ల ఇండ్లరేకుల పై కప్పులు ఎగిరిపడ్డాయి.